క్లుప్తంగా

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

నందిగామ: నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సెల్ఫ్ గవర్నమెంట్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించే సమయంలో వారు ఏ విధంగా బాధ్యతగా శ్రద్ధ తీసుకుంటారో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు క్లాసులు తీసుకునే సమయంలో తమకు ఎదురైన అనుభవాలను తోటి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దినేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎంపీపీ ప్రియాంక

నందిగామ: ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని ఎంపీపీ ప్రియాంక అన్నారు. మండల పరిధిలోని చేగూరులో సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. హాజరైన ఎంపీపీ ప్రియాంక గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్, గ్రామస్తులు శ్రీశైలం, బాల్‌రాజ్, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



పాదయాత్ర చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కేశంపేట: పేదలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతుందని ఆ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత కె. శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హాత్‌సే హాత్‌జోడో యాత్రలో భాగంగా ఆయన సోమవారం పలువురు నాయకులతో కలిసి మండలంలోని కొత్తపేట్, ముదార్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తపేట గ్రామానికి చెందిన నిరుపేద మహిళ జంగమ్మకు స్వంత నిధులతో ఇళ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల వైఫల్యాలను ప్రజలకు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బోనాల సంబురాలు



బోనంతో నృత్యం చేస్తున్న పావని

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలోని జీవన్‌గూడ గ్రామంలో ఎల్లమ్మ బోనాల సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం జీవన్‌గూడలో జరిగిన ఎల్లమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన బోనాల జాతరలో ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ బోనాల సంబరాల్లో నగరానికి చెందిన బోనం పావని పాల్గొని బోనంతో ఎన్కెపల్లి, జీవన్‌గూడ గ్రామస్తులను ఉర్రూతలు ఊగిస్తూ నృత్యం చేస్తూ భక్తులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా బోనం పావనితో పాటు ఆలయ నిర్మాణ దాత సనివెల్లి నరేందర్‌రెడ్డి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్‌తో పాటు ఎన్కెపల్లి సర్పంచ్ చందన, ఉపసర్పంచ్ వెంకటమ్మ, ఆలయం కోసం స్థలాన్ని అందించిన దాత సంగం రమేష్‌తో పాటు నాయకులు కుమ్మరి రాము, శివ, కుమ్మరి శ్రీను, వడ్డె రమేష్, గ్రామస్తులు, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొని ఎల్లమ్మ ఉత్సవాలను విజయవంతం చేశారు. బోనం పావనిని, నరేందర్‌రెడ్డితో పాటు రవియాదవ్‌లను ఘనంగా సన్మానించారు. దీంతో పాటు ఎన్కెపల్లి జీవన్‌గూడ గ్రామస్తులు పావనిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

గౌరెక్కాపరుల సంఘం కమిటీ ఎన్నిక

కేశంపేట: మండల పరిధిలోని ఆల్వాల గ్రామంలో సోమవారం శ్రీకృష్ణయాదవ గొర్రెకాపరుల సంఘం నూతన కమిటీను ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా ఆల్వాల నరేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, వెంకటేష్, కార్యదర్శులుగా బుచ్చయ్య,మధులతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కమిటీ సభ్యులకు నియామకపు పత్రాలను అందజేశారు.

విత్తు కంటే నారే మేలు

- నర్సరీలో నారు పెంచడంపై రైతుల ఆసక్తి
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన నారు
- పలువురికి ఉపాధి అవకాశం



ఖాసీంబౌలి సమీపంలో నర్సరీలో నాటే దశలో ఉన్న నారు...

మొయినాబాద్ రూరల్: మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు విధానంలో రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టుతున్నారు. సంప్రదాయ విధానాలకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. విత్తు దగ్గరే చిత్తు కాకుండా నర్సరీల్లో పెంచిన నారును రైతులు నమ్ముకుంటున్నారు. రైతుల ఆసక్తికి అనుగుణంగా గ్రామాల్లో ఇటీవల కాలంలో నర్సరీల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తురు జిల్లా మదనపల్లి నర్సరీలకు మంచి పేరు ఉంది. అక్కడి నుంచి ప్రతి రోజు వేలాది మంది రైతులు కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో సాగు చేస్తుంటారు. నాణ్యమైన నారును ఇస్తుండడంతో వీటికి మంచి ఆదరణ లభిస్తుంది. ప్రస్తుతం మొయినాబాద్ మండలంలోని ఖాసీంబౌలి, కనకమామిడి తదితర గ్రామాల్లో కూరగాయల నారు తెచ్చే నర్సరీలు ఉన్నాయి. ఈ నర్సరీలో టమాట, వంకాయ, కాలీఫ్లవర్, మిర్చీ, క్యాబేజీతో పాటు పువ్వుల నారు తదితర పంటల నారు పెంచి ఇస్తున్నారు. రైతులు విత్తనాలు ఇస్తే నారును పెంచి ఇవ్వడానికి రూ.50 పైసలు తీసుకుంటున్నారు. రైతులు విత్తనాలు ఇవ్వకపోతే మొక్కకు రూ.80 పైసలు చొప్పున తీసుకుంటున్నారు. ఎకరా విస్తరణలో టమాట సాగు చేయాలంటే 10 వేల మొక్కలు అవసరమవుతాయి. నర్సరీల నిర్వాహకులు రూ.4వేలు తీసుకొని ఎకరాకు సరిపడే నారును ఇస్తున్నారు.

పెంచే విధానం....

విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక ఉష్ణోగ్రత ఉంటే నారు చనిపోతుంది. సాధారణంగా రైతుల పొలాల్లో నారు పెంచే సమయంలో ఇలాగే నష్టపోతున్నారు. చీడపీడల బెడద కూడా ఎక్కువే. నర్సరీల్లో అయితే ఎండా పడకుండా షెడ్లు నెట్‌లను ఏర్పాటు చేస్తారు. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు. సేంద్రియ ఎరువులు వాడి నారును పెంచడం వల్ల నాణ్యమైన నారును పొందడానికి వీలుంటుంది. పొలాల్లో నారును పెంచడానికి నెల రోజులు పైగా సమయం పడుతుంది. అదే నర్సరీల్లో అయితే 20–25 రోజుల్లో నారు చేతికి వస్తుంది.

ఖర్చుల వివరాలు....

నర్సరీలు ఏర్పాటు చేయడానికి దాదాపు లక్షన్నర ఖర్చు అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. వీటిని ఏర్పాటు చేసుకునే రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా రూ.50వేలు అందిస్తుంది. నారును పెంచడానికి షెడ్లు ఏర్పాటు, నారు పెంచడానికి ప్రత్యేక ట్రేలను కొనుగోలు చేయాలి. టన్ను ఎరువు రూ.5వేల వరకు ఉంటుంది. నర్సరీల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నర్సరీ నిర్వహణకు కనీసం ముగ్గురు అవసరముంటారు. పరోక్షంగా మరో ముగ్గురికి ఉపాధి దొరుకుతుంది. అన్ని ఖర్చులు పోగా నెలకు రూ.12వేల వరకు గిట్టుబాటు అవుతుంది.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి..



ప్రభుత్వం సబ్సిడీ కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తే రైతులకు ఖర్చు తగ్గుతుంది. సబ్సిడీ విత్తనాలు ఇవ్వకపోవడంతో రైతులు ప్రైవేట్ నర్సరీలను ఆశ్రయిస్తున్నాం. ఈ పరిస్థితుల్లో ఎక్కువగా నారును కొనుగోలు చేస్తున్నారు. టమాట, వంకాయ, మిర్చీ తదితర కూరగాయల నారును రూ.80పైసల నుంచి రూ.1 వరకు విక్రయిస్తున్నాం. దీంతో రైతులకు నష్టం జరుగుతుంది. – సైపాల్ రెడ్డి, రైతు అమ్డాపూర్ గ్రామం

మక్కువతోనే నర్సరీ ఏర్పాటు..

వ్యవసాయంపై మక్కువతోనే నర్సరీ ఏర్పాటు చేసి నారును పెంచి విక్రయిస్తున్నాం. రైతులు విత్తనాలు ఇస్తే మొక్కకు రూ.50 పైసలు తీసుకుంటాం. విత్తనాలు ఇవ్వకపోతే రూ.80 పైసల నుంచి ఒక్క రూపాయి వరకు తీసుకుంటాం. నెలకు అన్ని ఖర్చులు పోగా రూ.12వేల వరకు ఆదాయం వస్తుంది. కొందరికి ఉపాధి కల్పిస్తున్నాం.

– వెంకట్‌నారాయణ, నర్సరీ నిర్వాహకుడు, ఖాసీంబౌలి

భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ

కొందుర్గు: మండల కేంద్రంలోని శివరామాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగ మహాపడి పూజను నిర్వహించారు. మండల పరిధిలోని భైరంపల్లిలో గురుస్వామి భూపాలాచారి ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ మహాపడిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. పవిత్రమైన హృదయంతో పరమేశ్వరుడిని పూజిస్తే, మోక్షం పొందుతారని అన్నారు. మహాపడి పూజ అనంతరం శివస్వాములు ఇరుముడి ధరించి, శ్రీశైలం బయలుదేరారు. ఆయా కార్యక్రమాల్లో శివస్వాములు ఈరపురం జగదీశ్వర్‌గౌడ్, శ్రీశైలం, వెంకటేష్, యాదయ్య, రామకృష్ణ, వెంకట్‌రాములు, రవి, యాదయ్య, లింగం, రిచిత్ పాల్గొన్నారు.



భైరంపల్లిలో పూజలో పాల్గొన్న శివ భక్తులు

పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్రంలోని నిరుపేదలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం మండలంలోని పామెన గ్రామానికి చెందిన చాకలిగూడెం మల్లయ్యకు రోడ్డు ప్రమాదం జరగడంతో ఆయన ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ పండ్ ఎల్‌ఓసీ 2,50,000 రూపాయల కాపీని బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబానికి తప్పనిసరిగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పెద్ద మొత్తంలో సీఎం రిలీఫ్ పండ్‌ను ప్రజలకు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పామెన సర్పంచ్ మల్లారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శేరి శివారెడ్డి, నాయకులు గని, ఫయాజ్, మహేశ్, రాంప్రసాద్, తదితరులు ఉన్నారు.

కేసీఆర్ నాయకత్వం అవసరం

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



మురుగు కాల్వల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి, జయమ్మ

షాబాద్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి దేశమంతా కేసీఆర్‌ను కోరుకుంటుందని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో రూ.12 లక్షల నిధులతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్డు, మురుగు కాలువల నిర్మాణాలను ఆయన సర్పంచ్ జయమ్మతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని చెప్పారు. ముద్దెంగూడ పంచాయతీని జిల్లాలోని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. గత మూడు ఏళ్లలో సుమారు రూ.40 లక్షల నిధులను వివిధ పథకాల కింద అందించినట్లు తెలిపారు. ఇందులో ఏడు లక్షల నిధులను సీసీ రోడ్లుకు, ఐదు లక్షల నిధులను మురుగు కాల్వలకు కేటాయించామన్నారు. షాబాద్ నుంచి ముద్దెంగూడను కలిపే రోడ్డును రీబీటీ చేస్తామని, శివాలయం అభివృద్ధికి సొంత డబ్బులను ఇస్తామని, ముద్దెంగూడ-ఏర్రోనిగూడ ఫార్మేషన్ రోడ్డును వెంటనే చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ వెంటయ్య, మాజీ సర్పంచ్ భూపతి రాజు, డైరెక్టర్ నర్సింహులు, నాయకులు సుదర్శన్, లింగం, పురుషోత్తం, సురేష్ తదితరులున్నారు.

శారీరక శ్రమతోనే సంపూర్ణ ఆరోగ్యం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: ప్రతినిత్యం యోగా, వ్యాయామం, ఉదయం వేళ కాలినడక వంటి శారీరక శ్రమ కలిగిన పనులను చేస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్రవంతి ఆధ్వర్యంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ఆరోగ్య మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి హాజరై మాట్లాడుతూ... ప్రతిఒక్కరు ఉదయం వేళల్లో శరీరానికి శ్రమ కలిగించే వ్యాయామాలను చేయాలని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా ఎక్సర్‌సైజ్‌లు చేస్తూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని అన్నారు. క్షయ వ్యాధి, బీపీ, షుగర్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలను పాటించడంతో పాటుగా ఆహార నియమాలలో మార్పులు చేసుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, రాజు, రవికుమార్, చెన్నయ్య, చంద్రకళ, శ్రీరామ, అమృత, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మీ ప్రాణ త్యాగం వృథా కాదు



చేవెళ్ల: పుల్వామా అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శంషాబాద్ ఏబీవీపీ విభాగ్ సందీపని కన్వీనర్ శ్రీకాంత్

షాబాద్: గతంలో శ్రీనగర్–జమ్మూ రహదారిపై ఉగ్రవాదులు జరిపిన దాడి పిరికి పంద చర్య అని శంషాబాద్ ఏబీవీపీ విభాగ్ సందీపని కన్వీనర్ బర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మౌంటెస్సరీ పాఠశాలలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాడుల్లో అసువులు బాసిన జవాన్ల త్యాగం మర్చిపోరాదన్నారు. ఉగ్రవాదులకు కేంద్ర ప్రభుత్వం సరైన బుద్ధి చెబుతుందని తెలిపారు. బలగాలపై ఉగ్రదాడి పిరికి పందల చర్యగా అభివర్ణించారు. 44 మంది సైనికులను కోల్పోయామని గుర్తు చేశారు. అల్లకల్లోలం సృష్టించిన ఉగ్రవాదులను ఏరిపారేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ షాబాద్ నగర కార్యదర్శి ప్రవీణ్, నాయకులు, వేణుగోపాల్, ప్రేమ్, అభినవ్, శివరామకృష్ణ, తదితరులున్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

చేవెళ్ల: దేశ ప్రజల రక్షణకోసం అమర జవాన్ల ప్రాణ త్యాగం మరువలేనిదని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో పుల్వామా అమర జవాన్లకు నివాళులర్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుల్వామా దాడిలో దాదాపు 40 మంది సైనికులు ఉగ్రవాదుల చేతిలో అమరులయ్యారని చెప్పారు. విద్యార్థులు ఈ విషయాలు తెలుసుకొని అమర జవాన్లను స్మరించుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని సూచించారు. జవాన్ల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు నితీష్, సాయిచందు, గణేశ్, సాయి, కుమార్, సిద్దు, తదితరులు ఉన్నారు.

అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం

- ప్రొటోకాల్ పాటించని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం
- మండల సమావేశంలో ఎంపీపీ ఆవేదన



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రియాంక

నందిగామ: ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించే అధికారులు తీరు మార్చుకోవాలని, లేని యెడల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ ప్రియాంక అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ ప్రియాంక అధ్యక్షతన మంగళవారం నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు దేపల్లికుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నందిగామలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఇటీవల రోడ్డును ప్రారంభించారని, ఆ రోడ్డు ఆర్‌అండ్ బీ శాఖ నిధుల నుంచి వేశారని, అధికారులు మాత్రం స్థానిక ఎంపీటీసీలకు, ఎంపీపీకి సమాచారం ఇవ్వకుండా స్థానిక సర్పంచ్, జెడ్పీటీసీలతో ఎలా ప్రారంభిస్తారని ఆర్‌అండ్‌బీ ఏఈ సందీప్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ ప్రియాంక మాట్లాడుతూ.. ఎంపీపీనైనా తనకు తెలియకుండా రోడ్డును ప్రారంభించడమేమిటని ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రమైన నందిగామకు పరిసర గ్రామాల ప్రజలు ఎంతో మంది తమ పనుల కోసం వస్తుంటారని వారికి కనీసం టాయిలెట్లు లేక పోవడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరుగు దొడ్లు నిర్మించాలని అధికారుల దృష్టికి తెచ్చారు. అదే విధంగా రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక బస్టాండ్‌ను తొలగించారని, దీంతో ప్రయాణికులు ఎండలోనే నిల్చుంటున్నారని వెంటనే నూతన బస్‌స్టాండును నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రయాన్‌గూడ నుంచి వీర్లపల్లికి వెళ్లే రోడ్డు ఓవర్ లోడ్ వాహనాలతో పూర్తిగా ధ్వంసమయిందని, ఆ రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, ఆ రోడ్డుపై వెళ్తున్న ఓవర్ లోడ్ వాహనాలను అరికట్టాలని కో ఆప్షన్ సభ్యుడు బేగ్ సంబంధిత అధికారుల దృష్టికి తెచ్చారు. అంతిరెడ్డిగూడ గ్రామానికి సర్పంచ్ ఉన్నారో.. లేక ప్రత్యేక అధికారి ఉన్నాడో తెలియని పరిస్థితి నెలకొందని ఎంపీటీసీ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల స్లాబ్ పెచ్చులు ఊడిపడి ఇటీవల కొంత మంది విద్యార్థులకు గాయాలైయ్యాయి. కావున, పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. మిగతా శాఖల అధికారులు తమ ఎజెండాను చదివి మామా అనిపించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, లత, తహసీల్దార్ రహ్మాన్ ఖాన్, ఎంపీడీఓ బాల్‌రెడ్డి, ఎంపీఓ గిరిరాజ్ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాజరు కానీ సర్పంచులు..

మండలంలోని 18 గ్రామాల సర్పంచులు మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావడంతో సమావేశంలో చర్చనీయాంశమైంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశంలో బాధ్యత గల ప్రజా ప్రతినిధులు హాజరై తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకునేందుకు కృషి చేయాల్సి ఉండగా 18 మందిలో ఏ ఒక్క సర్పంచ్ కూడా హాజరు కాకపోవడం వారి తమ బాధ్యతలు ఎంత వరకు సక్రమంగా నిర్వహిస్తున్నారో అనే చర్చ జోరుగా కొనసాగుతోంది. గత కొన్ని సమావేశాల నుంచి సర్పంచ్‌లు హాజరు కావడం లేదు. ఈ విషయమై గత సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సర్పంచుల గైర్హాజరు పై అసహనం వ్యక్తం చేశారు. అయినా కూడా వారు ఏ మాత్రం తీరు మార్చుకోలేక పోవడం గమనార్హం.

నేడు మండల సర్వసభ్య సమావేశం

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నేడు(బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ వినయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో విధిగా హాజరు కావాలని కోరారు.

కోరం లేక సమావేశం వాయిదా

కొందుర్గు: కొందుర్గు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సి ఉండగా ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా పడింది. ఎంపీపీ జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్‌తో పాటు కోరం ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు.

అంగన్‌వాడీలకు న్యాయం చేయండి

సీఐటీయూ నేత దేవేందర్

చేవెళ్ల: అంగన్‌వాడీల్లో గత 40 ఏళ్ల నుంచి ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ఇప్పటి వరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం ప్రభుత్వం కల్పించలేకపోయిందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ విమర్శించారు. మండలకేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి మంగళవారం చలో ఇందిరా పార్కు ధర్నాకు డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలపై సీఐ టీయూ ఆధ్వర్యంలో పలు మార్లు ధర్నాలు, ర్యాలీలు చేయడంతో పాటు అధికారులకు వినతి పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోగా అంగన్‌వాడీలచే వెట్టి చాకిరీ చేయించుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగా తీసుకువచ్చిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలనే డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి, అన్ని సౌకర్యాలు కల్పించాలని పలు డిమాండ్లతో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియర్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేసేందుకు తరలి వెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు ఉమా, స్వప్న, ప్రవీణ, చంద్రకళ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం నిర్మిస్తున్న డబ్లు బెడ్ రూం ఇళ్లను అర్హులందరికి అందించే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. పట్టణ శివారులోని గుండ్లకుంట శివారులో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇంటి పథకానికి దరఖాస్తున్న వారిలో నిజమైన అర్హులకు డబుల్ బెడ్ రూం ఇంటిని అందిస్తామని అన్నారు.పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ముందుకు సాగుతుందని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల స్థలంలో సీసీ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొందూటినరేందర్, కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు, ఎంపీటీసీ భీష్వరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో పేదలకు మేలు

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: అంధత్వ నివారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండంలోని కాకునూర్ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..శిబిరాల్లో భాగంగా వైద్యులు, సిబ్బంది రోగులకు పరీక్షలు చేపట్టడంతో పాటు ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమాదేవి, నాయకులు జగదీశ్వర్, సతీష్, వైద్యులు నిఖిత, కార్తీక్, సిబ్బంది వీణా, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం



విద్యార్థినులను అభినందిస్తున్న శారదావెంకటేష్, రమాదేవి

మొయినాబాద్ రూరల్: ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే ఎంతో ధైర్యాన్ని నింపుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల రిజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ శారదావెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల గురుకులంలో నిర్వహించిన మాస్టర్ జపాన్ చోటో ఖాన్ కరాటే డూ అసోసియేషన్ ఇండియా వారి ఆధ్వర్యంలో మరికా ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కరాటే పోటీల్లో చేవెళ్ల గురుకుల పాఠశాల నుంచి 52 మంది విద్యార్థినులు, చేవెళ్ల మండలంలోని గురుకుల పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ పోటీలు ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఆయా గురుకులాల విద్యార్థినులు విజయం సాధించారు. గెలుపొందిన విద్యార్థినులను శారద అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు రక్షిత, సంజన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఛాంపియన్ షిప్ ట్రోఫిని గెలుపొందడం అభినందనీయమన్నారు. 52 మందిలో 12 మంది బంగారు పతకాలు, 13 మంది వెండి పతకాలు, 26 మంది కాంస్య పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. స్వతహాగా ముందుకు వచ్చి విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నందుకు మాస్టర్ రాము, ప్రిన్సిపల్ రమాదేవిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.